# మ్యానిఫెస్టోలోని అంశాలే బీఆర్ఎస్ ఆయుధాలు

### సంక్షేమ పథకాలు అందుకున్న వారే బ్రాండ్ అంబాసిడర్స్

**-మరోసారి ఖైరతాబాద్‌లో గులాబీ జెండా • ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**

బంజారాహిల్స్.అక్టోబర్ 28: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మ్యానిఫెస్టోలో పెట్టిన కొత్త పథకాలే ఆయుధాలుగా రానున్న ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేస్తామని ఎమ్మెల్యే దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ డివిజన్లకు చెందిన మహిళా సంఘాలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమైన ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో సౌభాగ్యలక్ష్మి పేరుతో ప్రవేశపెట్టిన పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.400కు అందించడంతో పాటు రూ.15లక్షల ఆరోగ్య బీమా, రూ.5లక్షల జీవిత బీమా తదితర పథకాలను బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చడం జరిగిందని, వీటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలదే అన్నారు. తమకు కేటాయించిన బూత్‌లోనే నిరంతరం ఉంటూ ప్రచారంలో పాల్గొనాలని, ఇప్పటికే ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారిని కలిసి ఓటు వేయాలని కోరాలన్నారు. నియోజకవర్గంలో సుమారు 17వేల మందికి ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలు అందుతున్నాయని, వారితో పాటు ఇటీవల సుమారు 3వేలమందికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందించామన్నారు.



బీఆర్ఎస్ కార్యకర్తలతో ఎన్నికల నిర్వహణపై చర్చిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారే బ్రాండ్ అంబాసిడర్లు అనే విషయాన్ని గుర్తించుకుని ప్రచారంలో వారిని భాగస్వాములు చేయాలని ఆదేశించారు.



## మహిళల మద్దతు బీఆర్ఎస్‌కు ఇవ్వాలి

వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని సింగాడకుంట బస్తీలో మహిళా సంఘాల సభ్యులతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సమావేశమయ్యారు.రానున్న ఎన్నికల్లో మహిళల మద్దతు బీఆర్ఎస్‌కే ఇవ్వాలని కోరారు. పొదుపు సంఘాలకు ప్రత్యేక భవనాలు, వడ్డీలేని రుణాలు, సౌభాగ్యలక్ష్మి పథకం కింద రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నామని దానం నాగేందర్ హామీ ఇచ్చారు. – బంజారాహిల్స్,అక్టోబర్ 28:

## సరైన పత్రాలు లేకుంటే వాహనాలు స్వాధీనం



జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బంజారాహిల్స్/సికింద్రాబాద్,అక్టోబర్ 28: అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, మద్యం తరలింపును అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని వాహనాలను భారీగా స్వాధీనం చేసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 9 వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని పీఎస్‌కు తరలించారు. నాలుగురోజుల్లో సరైన పత్రాలులేని సుమారు 35 వాహనాలను గుర్తించామని, వాటికి సంబంధించిన యజమాని కాకుండా వేరేవ్యక్తులు నడిపిస్తున్నట్లు తేలిందన్నారు. తమ వాహనాలను ఎవరికి పడితే వారికి ఇవ్వడంతో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను, నిందితులను గుర్తించడం కష్టంగా మారుతోందని, దీన్ని నివారించేందుకు నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు.

**సికింద్రాబాద్‌లోని రవీంద్రనగర్‌లో..**

ఎన్నికలు సమీపిస్తుండటంతో వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మురం చేశారు.శనివారం సాయంత్రం నుండి రాత్రి వరకు తార్నాక నుండి సికింద్రాబాద్ వెళ్లే ప్రధాన రహదారి రవీంద్రనగర్‌లో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్షన్ కమిషన్ అధికారులు వాహనాల తనిఖీలను చేపట్టారు.

## నేటి నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

హిమాయత్‌నగర్,అక్టోబర్ 28: అఖిల భారత యువజన సమాఖ్య( ఏఐవైఎఫ్) రాష్ట్ర 2వ మహాసభలు హిమాయత్‌నగర్‌లోని తేరా పంత్ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగే సందర్భంగా హిమాయత్‌నగర్, నారాయణగూడలో జెండాలు,తోరణాలు,కటౌట్లను ఏర్పా టు చేసి అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ నేడు (ఆదివారం) నారాయణగూడ వైఎంసీఏ నుంచి భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించి సభ నిర్వహిస్తామన్నారు.ఈ మహాసభలకు రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్, ఏఐవైఎఫ్‌జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై పాల్గొని సందేశం ఇస్తారని తెలిపారు.

## నేడు దసరా మిలాప్-2023

కవాడిగూడ, అక్టోబర్ 28 : అరుంధతీయ బంధు సేవా మండలి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంయుక్తాధ్వర్యంలో నేడు భోలక్‌పూర్‌లోని దేవుని కోటలో 41వ వార్షికోత్సవ దసరా మిలాప్–2023 వేడుకలు నిర్వహించనున్నట్లు బంధు సేవామండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగ్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావు తెలిపారు.



**బీఆర్ఎస్‌లో చేరికలు:** ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు చేసే జిమ్మిక్కులు, ట్రిక్కులను చూసి ఆగమాగం కావద్దని, నిరంతరం పేదల కోసమే ఆలోచించే ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకువస్తేనే పేదలకు మేలు జరుగుతుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లోని ఓల్డ్ వెంకటేశ్వనగర్ బస్తీకి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. – బంజారాహిల్స్,అక్టోబర్ 28:



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ నేతృత్వంలో సోమాజిగూడ డివిజన్‌లోని పోచమ్మబస్తీ, అమీర్‌పేట్ మార్కెట్, సోమాజిగూడ బస్తీల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి బీఆర్ఎస్‌ను గెలిపిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఖైరతాబాద్, అక్టోబర్ 28 :

## యాదవులపై కాంగ్రెస్ చిన్నచూపు

### ఆల్ ఇండియా యాదవ మహాసభ యువజన అధ్యక్షులు రమేశ్ యాదవ్

ఖైరతాబాద్, అక్టోబర్ 28 : రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన యాదవులను కాంగ్రెస్ పార్టీ చిన్న చూపు చూస్తున్నదని ఆల్ ఇండియా యాదవ మహాసభ యువజన విభాగం అధ్యక్షుడు ఎ.రమేశ్ యాదవ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్‌కు ఆ పార్టీ మొండిచేయి చూపిందన్నారు. అంబర్‌పేట్ టికెట్‌ను కేటాయించకుండా అవమానపర్చిందన్నారు. ఆ పార్టీలో సీనియర్ నేతలుగా ఉన్న హన్మంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్ టికెట్ కేటాయింపుపై మౌనంగా ఉండడం విచారకరమన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఆపార్టీని తమ భుజస్కందాలపై మోసి నిలబెట్టిన చరిత్ర యాదవులకు ఉందని తెలిపారు. ములాయం సింగ్ యాదవ్, శరద్‌యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్‌లు వంటి వారి సేవలను మరిచిపోరాదన్నారు. రాష్ట్రంలోనే అధిక జనాభా కలిగిన యాదవులకు కేవలం రెండు సీట్లు మాత్రమే కేటాయించడం ఆ సామాజికవర్గంపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తుందన్నారు. లక్ష్మణ్ యాదవ్ టికెట్ విషయంలో పునరాలోచించాలని, లేని పక్షంలో కాంగ్రెస్‌ను ఓడగొడుతామన్నారు. ఈ సమావేశంలో యాదవ మహాసభ నాయకులు యశ్వంత్ రాజ్ యాదవ్, ఎం.విజయ యాదవ్, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్ యాదవ్

